సాక్షి
మంచిర్యాల

ఆదివారం 3 డిసెంబర్ 2023



ఇక సింగరేణి పోరు

అసెంబ్లీ ఎన్నికల కోలాహలం నేటితో ముగియనుంది. ఇక సింగరేణిలో 'గుర్తింపు' పోరు మొదలైంది. గుర్తింపు సంఘం 7వ దఫా ఎన్నికల ప్రక్రియ మరూవైంది. 10లో▸



ఇందారంలో 'మావో'ల కలకలం

జైపూర్ మండలం ఇందారంలో శనివారం మావోయిస్టుల అరెస్టు ఒక్కసారిగా కలకలం రేపింది. ఆధార్‌కార్డులు సృష్టించుకుని, ఇల్లు నిర్మించుకుని ఉంటున్నారు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /20.0

ఆకాశం ఉదయం వేళ పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు మద్యం దుకాణాలు బంద్

మంచిర్యాలక్రైం: జిల్లాలో ఆదివారం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మద్యం దుకాణాలు బంద్ పాటించాలని స్థానిక ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగా శనివారం సాయంత్రం 5గంటలకు మూసివేయగా.. ఆదివారం సాయంత్రం 5గంటల వరకు జిల్లాలోని 73 మద్యం దుకాణాలు, 16 బార్లు బంద్ ఉంచాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూనియర్ న్యాయవాదులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న జడ్జి అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో శనివారం జూనియర్ న్యాయవాదులకు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ శిక్షణ ఇచ్చారు. కోర్టు ఏర్పాటు చేసి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మాట్లాడుతూ న్యాయవాదులు నిరంతర అభ్యాసకులని అన్నారు. కేసుల్లో ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, క్రిమినల్ కేసుల్లో క్రాస్ ఎగ్జామినేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రతీ శనివారం శిక్షణ తరగతులు, అనంతరం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు చట్టాలపై జడ్జి, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రావు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం



జన్నారంలో మాట్లాడుతున్న ఇన్నారెడ్డి

జన్నారం: ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ టీఎస్ ధ్యేయమని, ఆ దిశగా సంఘం పని చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులతో జన్నారంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గజిటెడ్ హెచ్‌ఎంల పదోన్నతులను మల్టీజోన్ 1లో ఇప్పించిన ఘనత పీఆర్టీయూదేనని అన్నారు. ప్రస్తుతం మన ఊరి–మన బడి పథకం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చెందడంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందని తెలిపారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు త్వరలో రిలీవ్ కావడానికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగే విధంగా సంఘం కృషి చేస్తుందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్, సరెండర్ బిల్లులు త్వరలో పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. ఈ సమావేశంలో ఇటీవల హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన కట్ట రాజమౌళి, రామన్న, మురళీధర్, అజయ్‌కుమార్, శ్రీనివాస్‌లను సన్మానించారు. పీఆర్టీయూ నాయకులు రాజమౌళి, సత్యనారాయణ, రాజరావ్, మురళి, రమేశ్, విజయేందర్ పాల్గొన్నారు.

వైన్‌షాప్ వద్దని రెండో రోజూ ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా వైన్‌షాప్ ఏర్పాటు చేయవద్దని స్థానికులు శనివారం రెండో రోజూ ఆందోళన కొనసాగించారు. వైన్‌షాప్ నిర్వాహకులు సరుకును తీసుకురావడంతో ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులు, షాపు నిర్వాహకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ దీపక్ అక్కడికి చేరుకుని ఆందోళకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. వారు వినకపోవడంతో తప్పకుండా న్యాయం చేస్తామని లోడ్‌ను వెనక్కి పంపించి వేశారు. వైన్‌షాప్ ఏర్పాటు చేయొద్దని కాలనీ మహిళలు భీష్మించుకుని టెంట్ వేసి కూర్చున్నారు.



కౌంటింగ్ కేంద్రంలో టేబుళ్లు

తీర్పు నేడే

లెక్కింపు ఇలా..

నియోజకవర్గం	టేబుళ్లు	రౌండ్లు
మంచిర్యాల	14	21
బెల్లంపల్లి	14	16
చెన్నూరు	14	16
పోస్టల్ బ్యాలెట్	02	01

(ప్రతీ రౌండ్‌కు పట్టే సమయం 20నుంచి 30నిమిషాలు)

- కొద్ది గంటల్లోనే తొలి ఫలితం
- మధ్యాహ్నం వరకే ఫలితాలపై స్పష్టత
- మొదట బెల్లంపల్లి, తర్వాత చెన్నూర్, మంచిర్యాల
- పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో ప్రారంభం
- సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు
- తేలనున్న 44మంది అభ్యర్థుల భవితవ్యం

జిల్లా వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	పోలైనవి	పోలింగ్‌శాతం
మంచిర్యాల	289	2,74,807	1,90,057	69.16
చెన్నూరు	227	1,88,283	1,50,754	80.07
బెల్లంపల్లి	227	1,73,335	1,40,727	81.19
ఖానాపూర్(జన్నారం)	50	43,232	32,462	85.00

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎంతోమంది ఉత్కంఠగా ఎదురు చూస్తున్న అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే జరుగనుంది. ఆదివారం మధ్యాహ్నం వరకే తొలి ఫలితం వెలువడనుంది. గత నెల 30న పోలింగ్ జరుగగా.. మూడు నియోజకవర్గాల్లో 5.14లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి(ఎస్సీ), చెన్నూర్(ఎస్సీ) నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని జన్నారం మండల ఓట్లు నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో, సిర్పూర్ నియోజకవర్గంలో ఉన్న నాలుగు గ్రామాలైన భీమిని మండలం కేస్లాపూర్, చిన్నతిమ్మాపూర్, కన్నెపల్లి మండలం మాడవెల్లి, శాలిగాం వాసుల ఓట్ల లెక్కింపు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో నిర్వహించనున్నారు.

తేలనున్న 45మంది భవితవ్యం

మంచిర్యాల నియోజవకర్గంలో 17మంది, చెన్నూరులో 14మంది, బెల్లంపల్లిలో 13మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరితో పాటు 'నోటా' (పైవారెవరు కాదు) కూడా ఓట్లు లెక్కిసారు. మొత్తంగా 44మంది అభ్యర్థుల్లో ఎవరికి ఎన్ని పోలైనవి తేలనుంది. అభ్యర్థులతోపాటు వారు సూచించిన వారికి ఏజెంట్లు, వీడియో, సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు మధ్య కౌంటింగ్ జరగనుంది. ఇప్పటికే ఫలితాల కోసం ప్రత్యేకంగా 63మంది, మొత్తం 300మంది సిబ్బంది ఈ లెక్కింపు ప్రక్రియలో పాల్గొననున్నారు.

ర్యాలీలు, క్యాంపులకు రెడీ

గత మూడు రోజులుగా నలుగురు కలిసిన ప్రతీ చోట ఎవరు గెలుస్తారనే ముచ్చటే ప్రధానంగా సాగుతోంది. గెలిచే ఎమ్మెల్యేలపైనే అందరికీ ఉత్కంఠ నెలకొంది. తమ ఎమ్మెల్యేగా ఎవరు గెలుస్తారని నియోజకవర్గాల్లో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇక అభ్యర్థులకు ఆందోళన కొనసాగుతోంది. ఇక పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టలేని ఉత్కంఠతో ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో కొందరు విజయోత్సవ ర్యాలీలకు ఏర్పాట్లు చేసుకుంటే మరోవైపు ఓ పార్టీ గెలిచిన ఎమ్మెల్యేలతో క్యాంపులకు వెళ్లేందుకు రంగం సిద్ధమైంది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన 24గంటల వరకు విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు చేసుకోవద్దని పోలీసు శాఖ నిషేధాజ్ఞలు విధించింది.

తొలి ఫలితం బెల్లంపల్లి

ఉదయం 8గంటల నుంచే లెక్కింపు ప్రారంభమవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లు లెక్కిస్తారు. ఆ తర్వాత కంట్రోల్ యూనిట్ (సీయూ) సీల్ తెరవనున్నారు. ప్రతీ నియోజకవర్గ ఓట్లు లెక్కించేందుకు ఎదురెదురుగా ఏడు చొప్పున 14కౌంటింగ్ టేబుళ్లు ఉంటాయి. పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల 21రౌండ్లు, చెన్నూరు 17, బెల్లంపల్లి 17రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. ఎన్నికల పరిశీలకులు, అధికారుల సమక్షంలో 'సీయూ' ఓపెన్ చేసి రిజల్ట్ బటన్ నొక్కగానే 'బీప్'మని శబ్దం చేస్తూ ఫలితాలు చూపిస్తుంది. అలా అభ్యర్థుల వారీగా ఎన్ని ఓట్లు పోలైయ్యాయో తెలుస్తుంది. అలా మొదటి నుంచి నోటా వరకు లెక్కిస్తారు. అందరి సమక్షంలో సీల్ తీసి, వివరాలు చూసి, అందరూ సమ్మతం తెలిపాకే రెండో 'సీయూ'ని ఓపెన్ చేస్తారు. ఎవరికైనా అనుమానం ఉన్నట్లు అనిపిస్తే, బీయూతోపాటు వీవీ ప్యాట్‌లో ఓట్ల చిటీలు సైతం లెక్కించి అనుమానం తీర్చుతారు. ఈ క్రమంలో ప్రతీ రౌండ్‌కు 15నుంచి 20నిమిషాల సమయం పట్టనుంది. ఈ లెక్కన మధ్యాహ్నం ఒంటి గంట వరకే ఓ స్పష్టత రానుంది. పోలింగ్ కేంద్రాలను బట్టి బెల్లంపల్లి మొదట, తర్వాత చెన్నూరు, చివరగా మంచిర్యాల ఫలితాలు రానున్నాయి.

ఓటింగ్ 'ప్రత్యేక'త అంతంతే..!

- మోడల్ పోలింగ్ కేంద్రాల్లో నామమాత్రమే..
- ముందుకు రాని ఓటర్లు



మంచిర్యాల కేంద్రియ విద్యాలయంలోని మోడల్ పోలింగ్ కేంద్రం

మంచిర్యాలటౌన్: ఓటర్లను ఆకర్శించి.. వంద శాతం ఓటింగ్ నమోదయ్యేలా కేంద్ర ఎన్నికల సంఘం ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. అయినప్పటికీ గత నెల 30న జరిగిన పోలింగ్‌లో ఓటర్లను అంతంత మాత్రంగానే ఆకట్టుకున్నట్లు పోలైన ఓట్లను బట్టి చూస్తే తెలుస్తోంది. ప్రతీ నియోజకవర్గంలో 12 రకాల ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినా వాటిలో నమోదైన పోలింగ్ అంతంత మాత్రంగానే ఉంది. కనీసం 90శాతానికి పైగా పోలింగ్ నమోదవుతుందని భావించినా 85శాతంలోపే నమోదు కావడం గమనార్హం.

- మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో మంచిర్యాల ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 179వ పోలింగ్ కేంద్రంలో దివ్యాంగ ఉద్యోగులకు విధులు కేటాయించారు. పోలింగ్ సిబ్బంది ఐదుగురూ దివ్యాంగులే. పోలింగ్ కేంద్రం ప్రత్యేకతను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయారు. ఈ కేంద్రం పరిధిలో 1,016మంది ఓటర్లు ఉండగా 490 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 48.23. ఓటింగ్ శాతం నమోదైంది.
- లక్సెట్టిపేటలోని బోయవాడ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రం 83ను యువ ఉద్యోగులతో నిర్వహించారు. ఈ పోలింగ్ కేంద్రంలో 1,137 మంది ఓటర్లకు గాను 798మంది ఓటు వేయగా.. 70.18శాతం పోలింగ్ నమోదైంది.

మహిళల కోసం..

మహిళా సిబ్బందితో నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాల జెడ్పీఎస్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల 144వ పోలింగ్ కేంద్రంలో 1,412 మంది ఓటర్లు ఉన్నారు. 780 మంది ఓటు వేయగా 55.24 శాతం పోలింగ్ నమోదైంది.

- నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 235వ పోలింగ్ కేంద్రంలో 1,330 మంది ఓటర్లు ఉండగా 894 మంది ఓటు వేశారు. దీంతో 67.22 శాతం పోలింగ్ నమోదైంది.
- దండేపల్లి మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ 46వ పోలింగ్ కేంద్రంలో 1,261మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 946 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 75.02 శాతం నమోదైంది.
- హాజీపూర్ మండలం దొనబండ జెడ్పీఎస్ఎస్ 98వ పోలింగ్ కేంద్రంలో 940 మంది ఓటర్లగాను 747 మంది ఓటు వేయగా 79.47 శాతం పోలింగ్ నమోదైంది.
- లక్సెట్టిపేట ఎంపీపీఎస్ 82వ పోలింగ్ కేంద్రంలో 1,207 మంది ఓటర్లకు గాను 859 మంది ఓటు వేయగా 71.17 శాతం నమోదైంది.

మోడల్ పోలింగ్ కేంద్రాల్లో..

నియోజకవర్గంలో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో రెడ్, గ్రీన్ కార్పెట్‌లు వేసి, పూలకుండీలు, పూలు, బెలూన్లతో అందంగా తీర్చిదిద్దారు. ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాలను చూసి ఆకర్షితులై ఎక్కువ మంది ఓటు వేసేందుకు వస్తారని భావించారు. అయినా ఆశించిన స్థాయిలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోలేదు. మంచిర్యాలలోని కేంద్రియ విద్యాలయం 156వ పోలింగ్ కేంద్రంలో 856 మంది ఓటర్లు ఉండగా 495 మంది ఓటు వేయడంతో 57.83 శాతం నమోదైంది.

- నస్పూరులోని సింగరేణి హైస్కూల్ 244వ పోలింగ్ కేంద్రంలో 1,030 మంది ఓటర్లు ఉండగా, 369 మంది మాత్రమే ఓటు వేయడంతో 35.83 శాతం పోలింగ్ నమోదైంది.
- దండేపల్లి మండలంలోని పెద్దపేట్ ఎంపీపీఎస్ 17వ పోలింగ్ కేంద్రంలో 637 మంది ఓటర్లు ఉండగా 504 మంది ఓటు వేయడంతో 79.12 శాతం నమోదైంది.
- హాజీపూర్ మండలం ముల్కల్ల జెడ్పీఎస్ఎస్ 126వ పోలింగ్ కేంద్రంలో 990 మంది ఓటర్లు ఉండగా 838 మంది ఓటు వేయగా 84.65 శాతం పోలింగ్ నమోదైంది.
- లక్సెట్టిపేట మండలం గుళ్లకోట యూపీఎస్ 94వ పోలింగ్ కేంద్రంలో 739 మంది ఓటర్లు ఉండగా 608 మంది ఓటు వేయడంతో 82.27 శాతం పోలింగ్ నమోదైంది.

గూడెంలో కార్తీక పూజలు



సత్యదేవుణ్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. జిల్లాతోపాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. 465 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులతో గూడెం ఆలయ ప్రాంగణాలు రద్దీగా కనిపించాయి. ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు.

పటిష్ట బందోబస్తు





లెక్కింపు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్నికల అధికారి సంతోష్, పాల్గొన్న అధికారులు, సిబ్బంది

- జిల్లా ఎన్నికల అధికారి సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఓట్ల లెక్కింపునకు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, స్ట్రాంగ్ రూం వద్ద కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. శనివారం ఆయన ఎన్నికల పరిశీలకులు బిశ్వజిత్ దత్తా, సజ్జన్ ఆర్, కౌంటింగ్ పరిశీలకులు సిద్ధ లింగయ్య, బెల్లంపల్లి ఆర్వో, అదనపు కలెక్టర్ రాహుల్, చెన్నూర్ ఆర్వో సిడాం దత్తులతో కలిసి ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కిపు పకడ్బందీగా చేపట్టనున్నామని తెలిపారు. మొత్తంగా ఓట్ల లెక్కింపులో 300 మంది సిబ్బంది పాల్గొంటున్నారని అన్నారు. అభ్యర్థుల నుంచి నియామకమైన ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరుగుతుందని అన్నారు. లెక్కింపు కేంద్రం పరిసరాల్లో సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, లెక్కింపు కేంద్రంలోకి ఎన్నికల సంఘం నిబంధనలకు మేరకు గుర్తింపు కార్డు ఉన్న వారిని అనుమతిస్తామని పేర్కొన్నారు. లెక్కింపు హాల్‌లోకి మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధమని, ఏజెంట్లు లెక్కింపు అధికారులకు సహకరించాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎన్నికల ప్రవర్తనా నియామవళి మేరకు చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

మూడంచెల భద్రత

మంచిర్యాలక్రైం: కళాశాలలోని లెక్కింపు కేంద్రం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ పరిశీలకుడు ఆర్.ఇలాంగో, రామగుండం సీపీ రెమారాజేశ్వరితోపాటు మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. లెక్కింపు కేంద్రం మొత్తం మూడంచెల భద్రత పరిధిలో ఉంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరం వరకు ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండకూడదని తెలిపారు. 300 మంది పోలీసు సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 100 మంది సీఆర్‌పీఎఫ్ బలగాలు, కేంద్రం బయట 100 మంది ఏఆర్ పోలీసు, రహదారులపై మరో వంద మంది సివిల్ పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. లెక్కింపు కేంద్రంలో మంచిర్యాల, బెల్లంపల్లి, జైపూర్ ఏసీపీలతోపాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సీఆర్‌పీఎఫ్, ప్రత్యేక పోలీస్ బలగాలు, జిల్లా పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు.

లెక్కింపునకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరిశీలించిన కలెక్టర్ సంతోష్
- భారీ పోలీసు బందోబస్తు



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలటౌన్/బెల్లంపల్లి/చెన్నూర్: జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ మూడు నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. లెక్కింపును ఆదివారం ఉదయం 8 గంటల నుంచే ప్రారంభిస్తారు. ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్ల ద్వారా 14 పోలింగ్ కేంద్రాల ఫలితాలను ఒకేసారి వెల్లడిస్తారు. మొత్తం 55 రౌండ్లలో జిల్లా ఫలితాలు వెల్లడవుతాయి. మధ్యాహ్నం 3గంటల తర్వాత ఎన్నికల ఫలితాలు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు తనిఖీలు చేపడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఆర్పీఎఫ్ బలగాలు సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియ జరిగే కేంద్రాలు, బయట సీసీ కెమెరాలు అమర్చారు. ఎప్పటికప్పుడు ఫలితాల వెల్లడికి మీడియా పాయింట్ ఏర్పాటు చేశారు.

అధికారులు, ఏజెంట్ల సమక్షంలోనే

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుళ్లు, రిటర్నింగ్ అధికారికి మరో అదనపు టేబుల్ ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు అధికారులు ఉంటారు, వీరికి మూడు కుర్చీలు ఏర్పాటు చేశారు. కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రోఅబ్జర్వర్లు ముగ్గురు ఉంటారు. అభ్యర్థులకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లు ఒక్కో టేబుల్‌కు ఒకొక్కరు చొప్పున మొత్తం 14 మంది కౌంటింగ్ కేంద్రంలో ఉండేందుకు అవకాశం కల్పించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సహాయకునిగా ఉంటారు. కౌంటింగ్‌కు ముందు ప్రిసైడింగ్ అధికారి సంతకంతో ఉన్న 17సీ ఫారం వివరాలను ఏజెంట్లకు తెలియజేస్తారు. 14 టేబుళ్లలో ఒకేసారి కౌంటింగ్‌ను మొదలుపెట్టి, ఒక్కో రౌండ్‌లో 14 పోలింగ్ స్టేషన్ల ఫలితాలను విడుదల చేస్తారు. 17సీ ఫారంలో ఈవీఎంల వారీగా పోలైన ఓట్ల వివరాలు(పోలింగ్ పూర్తయ్యాక నమోదు చేసినవి) పోలైన ఓట్లు, ఈవీఎంలో నిక్షిప్తమైన ఓట్లు సమానంగా ఉన్నాయో లేదో సరిచూసుకుంటారు. వాటిని నోట్ చేసుకోవడంతోపాటు ఏజెంట్లకు కూడా చూపించి వారి సంతకాలు తీసుకుంటారు. వాటిని ఏజెంట్లు నోట్ చేసుకున్న అనంతరం ఈవీఎంల సీల్‌ను తొలగించి ఫలితాల బటన్‌నొక్కుతారు. వెంటనే అభ్యర్థుల వారీగా పోలైన ఓట్లు వెలువడుతాయి. ఒక్కో రౌండ్‌లో 14 ఈవీఎంల ఫలితాలు వెల్లడవుతాయి. లెక్కింపు ప్రక్రియ అంతా రాజకీయ పార్టీలు, ఏజెంట్ల సమక్షంలోనే సాగుతుంది. ప్రతీ రౌండ్ ఫలితం వారు సంతృప్తి చెందిన తర్వాతే వెల్లడిస్తారు. కౌంటింగ్ పూర్తయిన అనంతరం అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఏదైనా ఒక వీవీప్యాట్‌లోని ముద్రిత ఓటర్ స్లిప్‌లను లెక్కిస్తారు. దీంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిచేసిఫలితాలను సంబంధిత అధికారులు వెల్లడిస్తారు.

మూడు ఫ్లోర్లలో..

ఐజా ఇంజినీరింగ్ కళాశాల భవనంలో మూడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు. చెన్నూరు నియోజకవర్గం కౌంటింగ్‌ను కళాశాలలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో, బెల్లంపల్లి కౌంటింగ్ కేంద్రాన్ని భవనంలోని మొదటి అంతస్తు రూమ్ నంబర్ 1లో, మంచిర్యాల కౌంటింగ్ కేంద్రాన్ని భవనంలోని సెకండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేశారు.



కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రత



బెల్లంపల్లి కౌంటింగ్ కేంద్రం అధికారులు

క్లుప్తంగా

కారు, బైక్ ఢీ..ఒకరికి తీవ్ర గాయాలు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో శనివారం కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో దండేపల్లికి చెందిన పాలకుర్తి లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డాడు. బైక్‌పై వస్తున్న లక్ష్మణ్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

ప్రచారం డబ్బులడిగిన మహిళపై దాడి


గాయపడిన ఈశ్వరమ్మ

మందమర్రిరూరల్ (చెన్నూర్): ఎన్నికల ప్రచారంలో తిప్పుకుని డబ్బులడిగితే దాడి చేసిన సంఘటన మందమర్రిలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన వృద్ధ దంపతులు తాళ్ల ఈశ్వరమ్మ, బాపు ఈ నెల 26, 27 తేదీల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారానికి పిలిస్తే వెళ్లారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.300ల చొప్పున రెండు రోజులకు కలిపి ఇద్దరికి రూ.1200లు రావాల్సి ఉండగా ఈశ్వరమ్మ నాయకులు కర్ణాకర్ ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో అతని భార్య దాడికి పాల్పడడంతో కుడి చేతికి గాయమైంది. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలు పేర్కొంది. ఇదిలా ఉంటే మందమర్రిలో అంతా ఇదే పరిస్థితి నెలకొందని, ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బులు సరిగా పంపిణీ చేయలేదని, నాయకుల ఇంటిచుట్టూ తిరిగితే బెదిరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై చంద్రకుమార్‌ను వివరణ కోరగా దీనిపై కొంత మంది పిటిషన్ ఇచ్చారని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మృతదేహాలకు పోస్టుమార్టం


మృతదేహాలను పరిశీలిస్తున్న శ్యాంనాయక్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బెస్తవాడలో శుక్రవారం రాత్రి హత్యకు గురైన బామ్నె శ్రీను, గుబిడె శ్రావణ్ మృతదేహాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. శనివారం వైద్యులు రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. ప్రతీకార హత్యలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. కాగా జిల్లా కేంద్రంలో రెండు హత్యలు జరగడం కలకలం రేపింది.

విరబూసిన బ్రహ్మకమలం

దండేపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న లచ్చుపటేల్ ఇంటి ఆవరణలో మూడు నెలల క్రితం బ్రహ్మకమలం మొక్క నాటాడు. మొక్కకు శనివారం మూడు పువ్వులు విరబూశాయి. బ్రహ్మకమలం పుష్పాలు ఏడాదిలో రెండు సార్లు శ్రావణ మాసం, కార్తీక మాసంలో మాత్రమే వికసిస్తాయి. ప్రస్తుతం కార్తీక మాసం ముగిసే సమయంలో పూలు విరబూశాయి.


విరబూసిన బ్రహ్మ కమలం

గో సేవ.. సేంద్రియ తోవ

- ఒక్క ఆవుతో గోశాల ప్రారంభం
- ప్రస్తుతం 26కు చేరుకున్న గోవులు
- ఆవు పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువు తయారీ
- ఆదర్శం.. శివలింగాపూర్ గోశాల


సతీశ్ ఇంటి వద్ద ఉన్న గోశాలలో ఆవులు

చెన్నూర్‌రూరల్: వ్యవసాయరంగంలో ఎద్దులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంటిముందు చూసినా ఆవులు, గేదెలు, ఎద్దులు కనిపించేది. స్వచ్ఛమైన పాలకోసం పల్లెల్లో ఇంటింటా ఆవులు, గేదెలను పెంచేవారు. కానీ రాను రాను వాటి పోషణ భారమైంది. ఆవులను పోషించడం చాలా కష్టతరంగా మారడంతో పల్లెల్లో పశు సంపద తగ్గుతూ వస్తోంది. ఇక పట్టణాల్లో ఆవులకు సరైన మేత దొరకక ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు తింటున్నాయి. కానీ మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన గోనె సతీశ్ అనే రైతు మాత్రం గోమాతపై ఉన్న మక్కువతో తన ఇంటి వద్ద ప్రత్యేకంగా గోశాలను ఏర్పాటు చేశాడు. 2016లో ఒక్క ఆవుతో గోశాలను ప్రారంభించాడు. మధ్యలో ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా పట్టు వీడకుండా నెమ్మది, నెమ్మదిగా ఆవుల సంఖ్యను పెంచుతూ వచ్చాడు. ప్రస్తుతం గోశాలలో ఆవుల సంఖ్య 26కు చేరుకుంది. గోవుల కోసం ప్రత్యేకంగా ఇంటివద్ద తనకున్న ఎకరా స్థలంలో 10 గుంటల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేశాడు. 20 గుంటల్లో కూరగాయలు, మరో పది గుంటల్లో ఆవుల మేత కోసం పచ్చిగడ్డి పెంచుతున్నాడు. ఆవులకు ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పచ్చిగడ్డి, తౌడు, ఇతర దాణా అందిస్తున్నాడు. సతీశ్ సోదరుడు భాస్కర్, కుటుంబ సభ్యులు అతనికి గోశాలలో చేదోడు, వాదోడుగా ఉంటున్నారు.

గృహ ప్రవేశాలకు ఉచితం

కొత్తగా నిర్మించుకున్న ఇళ్లల్లో మొదటిసారి తప్పనిసరిగా ఆవు, లేగదూడలతో గృహ ప్రవేశం చేయించడం ఆనవాయితీ. ఆవు, లేగదూడలను నూతన గృహ ప్రవేశానికి తీసుకు వచ్చేందుకు ఎంతో కొంత డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ సతీశ్ మాత్రం నూతన గృహ ప్రవేశాలకు ఆవు, లేగెదూడలను ఉచితంగా పంపిస్తున్నాడు. ఇందుకు డబ్బులు ఇవ్వకుండా వాటికి దాణా పెడితే చాలంటున్నాడు.

సేంద్రియ ఎరువుల తయారీ

ఆవు పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నాడు. సేంద్రియ ఎరువుతో కూరగాయలను సాగు చేస్తున్నాడు. ద్రవ, ఘన జీవామృతం ఎరువులను తయారు చేసి కూరగాయల సాగులో నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నాడు. త్వరలోనే మరిన్ని ఆవులను తీసుకు వస్తానని, ఎవరైనా ఆవులు పంపిస్తే కూడా వాటిని కూడా గోశాలలో ఉంచి పెంచడం జరుగుతుందని సతీశ్ చెబుతున్నాడు. అందుకు తనను 9000402074 నంబరులో సంప్రదించాలని కోరుతున్నాడు.

గోమాత అంటే ఎంతో ఇష్టం



మాది వ్యవసాయ కుటుంబం. నాకు గోమాత అంటే ఎంతో ఇష్టం. అందుకే గోశాల పెట్టాలని కోరిక. మాకు ఇంటి వద్ద ఎకరా స్థలం ఉంది. అందులోని పది గుంటల స్థలంలో షెడ్డు నిర్మించి ఒక్క ఆవుతో గోశాల ప్రారంభించా. ప్రస్తుతం 26 వరకు ఆవులు ఉన్నాయి.

– గోనె సతీశ్, గోశాల నిర్వాహకుడు, శివలింగాపూర్

హ్యాండ్‌బాల్ జోనల్‌స్థాయి ఎంపిక పోటీలు


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

భీమారం(చెన్నూర్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం అండర్–14 బాలబాలికల, అండర్–17 బాలుర హ్యాండ్‌బాల్ జోనల్ స్థాయి ఎంపిక పోటీలు ప్రారంభించారు. ఇందులో ఎంపికైన వారు త్వరలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పాల్గొంటారని జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి పరిమళ తెలిపారు. ఈ పోటీలలో మొత్తం 200 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల కన్వీనర్, పాఠశాల హెచ్‌ఎం విక్రమ్‌కుమార్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ క్రీడల అధికారి బండ మీనారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు విఠల్, సదానందం, సాగర్, శ్రీనివాస్, రవి, రాకేష్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మధున పోచమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కోటపల్లి(చెన్నూర్) మండలంలోని జనగామలో మూడు రోజులుగా కన్నుల పండువగా సాగిన మధున పోచమ్మ జాతర శనివారం ముగిసింది. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లు, బోనాలతో భక్తులు అమ్మవారి చెంతకు చేరుకున్నారు. కొత్తకుండలో వండిన పాయసం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి సల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. మొదటిరోజు గోదావరి పుణ్యస్నానంతో జాతర ప్రారంభం కాగా రెండో రోజు రథయాత్ర, మూడో రోజు బోనాల సమర్పణతో జాతర ముగిసింది. జాతరకు జనగామ, వెంచపల్లి, సుపాక, నందరాపల్లి, ఆలుగామ, ఎదులబందం, బొప్పారం గ్రామాలతో పాటు చెన్నూర్ పొరుగునే ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గట్టు లక్ష్మణ్‌గౌడ్ ఏర్పాట్లు చేశారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ఘటన సమయంలో వాహనంలో 23 మంది కూలీలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని గుండాల గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం గుండాల గ్రామానికి చెందిన 23 మంది కూలీలు ట్రాక్టర్‌లో రోంపెల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో 8 మందికి త్రీవంగా మరి కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మస్టర్‌ను ప్లేడేగా పరిగణించాలి


మాట్లాడుతున్న పత్తెం రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి కార్మికుల మస్టర్‌ను ప్లేడేలుగా పరిగణించాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. శనివారం గోలేటిలోని హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూడకపోవడం బాధాకరమన్నారు. సింగరేణిలో సెలవు దినం విధులు నిర్వహించిన వారికి రెండు మస్టర్లు చెల్లించే యాజమాన్యం ఎన్నికల్లో విధులు నిర్వహించిన సింగరేణి క్లర్కులు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది, ఇతర కార్మికులకు ప్లేడేలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో ఏరియా ఆర్గనైజర్ ఎస్కే ఇనూష్, ఎస్అండ్‌పీసీ పిట్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, హాస్పిటల్ ఇన్‌చార్జి ఆర్. శ్రీనివాస్, భిక్షపతి పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ తల్లి మృతి
- కూతురి పరిస్థితి విషమం


నిర్మల మృతదేహం

తాండూర్(బెల్లంపల్లి): వ్యక్తిగత కారణాలతో తల్లీకూతుళ్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన గొడిసెల నిర్మల (40) భర్త గతంలోనే మృతి చెందగా కూతురు రచన (19)తో కలిసి నివాసం ఉంటోంది. శుక్రవారం రాత్రి వ్యక్తిగత కారణాలతో ఇద్దరూ గొడవ పడ్డారు. తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన రచన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన నిర్మల తానూ గడ్డిమందు తాగింది. ఇరువురిని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి నిర్మల శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. రచన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై నిర్మలకు సోదరుడి వరుసైన ఇడిగిరాల కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాయ్ రాజా.. కాయ్

- నేడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- ఫలితాలపై రూ.కోట్లలో బెట్టింగ్
- పందెం కాస్తున్న వ్యాపారులు, నేతలు, యువకులు

- దహెగాం మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు, బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపుపై ఆయా పార్టీల నాయకులు, వ్యాపారులు, యువకులు రూ.లక్షల్లో బెట్టింగ్ కడుతున్నారు.
- ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుపై పార్టీ కార్యకర్తలు, వ్యాపారులు, యువకులు జోరుగా బెట్టింగ్ కడుతున్నారు.
- బెజ్జూర్ మండలంలోని కార్యకర్తలు బెట్టింగ్‌లో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. తమ అభిమాన నాయకుడు ఎన్నికల్లో గెలుస్తాడని వ్యవసాయ భూములను సైతం బెట్టింగ్ పెడుతున్నారు.
- కౌటాల మండల కేంద్రానికి చెందిన ఆయా ప్రధాన పార్టీల నాయకులు నగదుతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు బెట్టింగ్ కడుతున్నారు.



కౌటాల(సిర్పూర్): అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్‌ల జోరు ఊపందుకుంది. సార్వత్రిక ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నేడు ఓట్ల లెక్కింపు ఉండడంతో అభ్యర్థుల గెలుపోటముల బెట్టింగ్ జోరు సాగుతోంది. ప్రధాన కూడళ్లలో నలుగురు కలిసి కూర్చుంటే చాలు అభ్యర్థుల విజయావకాశాలపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. మరికొందరు ఒక అడుగు ముందుకేసి అభ్యర్థుల గెలుపోటములపై పందెం కడుతూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఫలితాలు నేడే

బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల అభ్యర్థులపై బెట్టింగ్ జోరుగా సాగుతోంది. అభ్యర్థుల గత చరిత్ర , ప్రస్తుత బలాబలాలు, బలహీనతలపై ప్రజలు, రాజకీయ విశ్లేషకుల మధ్య ప్రధానంగా చర్చ జరుగుతోంది. క్రికెట్ బెట్టింగ్ మాదిరి చైన్ పద్ధతిలో కాకుండా వ్యక్తిగతంగా డబ్బుల పంపకం నిర్వహిస్తున్నారు. నేడు ఓట్ల లెక్కింపు ఉండడంతో తమ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ఒకరు, కాదు తమ నాయకుడే గెలుస్తాడని ఇంకొకరు బెట్టింగ్‌లు కడుతున్నారు.

రూ.కోట్లలోనే బెట్టింగ్..!

జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లు, మట్కా, జూదం విచ్చలవిడిగా సాగిన సందర్భాలు గతంలో అనేకం ఉన్నాయి. ఈజీ మనీకి అలవాటు పడ్డ బడాబాబుల బిడ్డలు ఈ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. తమ విశ్లేషణ ప్రకారం ఫలానా అభ్యర్థి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందుతాడు చూడండి.. అంటూ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. రూ.5 వేల నుంచి మొదలుకొని రూ.లక్ష వరకు పందెం కాస్తున్నారు. ఈ సారి ఎన్నికలు హోరాహోరీగా జరిగాయని, ఏ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ రాదని కార్యకర్తలు బెట్టింగ్‌కు పాల్పడుతున్నారు. ఆయా పార్టీల అభిమానులు తమ అభ్యర్థుల గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూ బెట్టింగ్‌లు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వ్యాపారులు సైతం ఈ బెట్టింగ్‌లో పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో రూ.కోట్లలోనే బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములతో పాటు రాష్ట్రంలో ఫలానా పార్టీ అధికారంలోకి వస్తుంది. ఫలానా వ్యక్తి ముఖ్యమంత్రిగా బాధ్యతలు సైతం స్వీకరిస్తాడంటూ.. కావలిస్తే బెట్ కట్టండి అంటూ ఒకరినొకరు రెచ్చగొడుతున్నారు.

తనిఖీ చేసి.. ఫైన్ వేసి


ఫైన్ రాస్తున్న ఆర్టీసీ అధికారులు

భీమిని(బెల్లంపల్లి): 'టికెట్ లేని ప్రయాణం నేరం....అందుకు రూ.500 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది' అనే నినాదం ఆర్టీసీ బస్సుల్లో రాసి ఉంటుంది. దీనికి తగ్గట్టుగా శనివారం దహెగాం నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును జన్కాపూర్ వద్ద విజిలెన్స్ అధికారులు ఆపి తనిఖీ చేశారు. ఓ మహిళ టికెట్ తీసుకోకపోవడంతో రూ.30 టికెట్ చార్జీతో పాటు రూ.500 జరిమానా విధించారు.

మావోల అలజడి

- ఇందారంలో ఇద్దరు మావోయిస్టుల అరెస్ట్
- హైఅలర్ట్ ప్రకటించిన పోలీస్ యంత్రాంగం
- ప్రారంభమైన మావోయిస్టుల వారోత్సవాలు

మంచిర్యాలక్రైం: జిల్లాలో మావోయిస్టుల అలజడి మొదలైంది. మావోయిస్టుల ఉనికి తగ్గిందని పోలీసులు చేస్తున్న ప్రచారాన్ని మావోలు తిప్పికొడుతున్నారు. ఈ నెల 2నుంచి మావోయిస్టుల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. వాటిని తిప్పికొట్టేందుకు పోలీసులు అడవుల్లో జల్లెడ పడుతున్నారు. ఈ నేపథ్యంలో జైపూర్ మండలం ఇందారంలో ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడంతో జిల్లాలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

వారోత్సవాల నేపథ్యం

అప్పటి సీపీఐ ఎంఎల్ పీపుల్స్‌వార్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నల్లా ఆదిరెడ్డి, ఏపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, ఉత్తర తెలంగాణ స్పెషల్‌జోన్ కమిటీ కార్యదర్శి శీలం నరేష్ 1999 డిసెంబర్ 2న కొయ్యూర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందారు. వారి వర్ధంతిని 2000 డిసెంబర్ 2న పీపుల్స్ గెరిల్లా ఆర్మీ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఏటా మావోయిస్టులవారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

'పొంగులేటి'కి సీఎం పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న సంతోష్

మందమర్రిరూరల్(చెన్నూర్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికే ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక సంతోష్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాతే ఇతర పార్టీల నుంచి ముఖ్యులు వచ్చి చేరారని, చాలాచోట్ల రాహుల్‌గాంధీ సభలు విజయవంతం అయ్యాయన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు శేఖర్, కుమార్, రాజేశ్, రాజు, స్వామి, వేణు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావంతో పలు రైళ్ల రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: చెన్నై నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లను రద్దు చేస్తూ ఉన్నతాధికారులు శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు కాగజ్‌నగర్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ తెలిపారు. కోచువెల్లి నుంచి గోరఖ్‌పూర్ అప్, డౌన్ (కోచువెల్లి ఎక్స్‌ప్రెస్) ఈ నెల 4, 7 తేదీల్లో, చెన్నై నుంచి న్యూ ఢిల్లీ అప్, డౌన్ (జీటీ ఎక్స్‌ప్రెస్)ను ఈ నెల 4 నుంచి 6 వరకు, 8న, చెన్నై నుంచి అహ్మదాబాద్ అప్, డౌన్ (నవజీవన్ ఎక్స్‌ప్రెస్)ను ఈ నెల 3 నుంచి 6వరకు, చెన్నై నుంచి ఛప్రా అప్, డౌన్ రైలును ఈ నెల 5, 7 తేదీల్లో, చెన్నై నుండి బిలాస్‌పూర్ అప్, డౌన్ రైలును 3, 5 తేదీల్లో, మైసూర్ నుంచి జైపూర్ అప్, డౌన్ రైలును ఈ నెల 4, 6 తేదీల్లో, పాండిచ్చేరి నుంచి న్యూఢిల్లీ అప్, డౌన్ రైలును ఈ నెల 4, 7 తేదీల్లో, ఎర్నాకులం నుంచి బిలాస్‌పూర్ వరకు అప్, డౌన్ రైలును ఈ నెల 4, 7 తేదీల్లో, రామేశ్వరం నుండి వారాణాసి అప్, డౌన్ రైలును ఈ నెల 4, 8 తేదీల్లో రద్దు చేశారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో మిఛావుంగ్ తుపాన్ ప్రభావంతో ఈ రైళ్లను రద్దు చేసినట్లు ఆయన వివరించారు. కాగజ్‌నగర్, మంచిర్యాల, బెల్లంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని, రైళ్ల రాకపోకలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9701371147 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకుల దాడి


చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్త

చెన్నూర్: చెన్నూర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారు. బాధితుడు బొంతల సందీప్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తగూడెం కాలనీకి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బొంతల సందీప్ ఇంటి ముందు రెండు రోజుల క్రితం డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా విద్యుత్ తీగలు తొలగించడంతో ఇంట్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం సాయంత్రం 16వ వార్డు కౌన్సిలర్ తుమ్మ రమేశ్ ఇంటికి వెళ్లి విద్యుత్ తీగలు అమర్చేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. దీంతో కౌన్సిలర్ రమేశ్ కర్రతో దాడి చేయడంతో గాయాలయ్యాయి. 108లో ఆస్పత్రికి తరలించారు. పెద్దగూడెం కాలనీకి చెందిన వడ్లకొండ వరప్రసాద్‌పై అదే కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తగరం సంపత్ దాడి చేశాడు. ఈ దాడిలో వరప్రసాద్ తల్లి రాజక్కకు గాయాలయ్యాయి. ఇరువురిని అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, రవికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం షాపు వద్దని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకురాళ్లు

శ్రీరాంపూర్: పట్టణంలోని ఆర్కే 6 కొత్తరోడ్‌లో మద్యం షాపు పెట్టవద్దని బీఎస్పీ మహిళా విభాగం నాయకురాళ్లు నిరసన వ్యక్తం చేశారు. షాపు తెరిచేందుకు యజమాని ఏర్పాట్లు చేస్తుండగా బీఎస్పీ కన్వీనర్ భవాని, ఇతర మహిళలు వచ్చి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ 363 వల్ల ముందున్న సర్వీస్‌రోడ్డు చిన్నగా మారిందని, ఇక్కడ వైన్స్‌షాప్ ఏర్పాటు చేస్తే వాహనాల పార్కింగ్ సమస్య ఏర్పడుతుందన్నారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్ ఇబ్బంది రాకుండా యజమానితో మాట్లాడుతామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

9న లక్ష దీపోత్సవం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 9న లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ గోదారంగనాథ కోలాట బృందం నిర్వాహకురాలు మంజుభాషిణి తెలిపారు. శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనంతో శ్రీ త్రిదండి దేవనాథ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో లోక కల్యాణార్థం శనివారం సాయంత్రం 5 గంటలకు శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీనివాస కల్యాణం, లక్ష దీపోత్సవం, ఊంజల సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం జీ: 18K ఫోన్ : 9640258899/ 9640468899 [H-793659]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376. [H-788229]

www.sakshi.com

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

Growth Oppurtunity for Females. Exp / No Exp with Fluency in English. Proven Computer Skills. Jobs: Executive Assistant / Web Designers / Digital Marketers / Tele Callers. Call RK: 630-007-1947 [W-1220874]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.